క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ-2 చక్రధర్

గజపతినగరం రూరల్: మండలంలోని లింగాలవలస ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ-2 చక్రధర్ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలు, పాఠశాల రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

దారి బాగుచేయరూ..

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన శ్మశానం చుట్టు చెత్తాచెదారాలు పేరుకుపోయి శ్మశానానికి వెళ్లే దారి మూసుకుపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఉన్న శ్మశానం రక్షణ గోడ కూడా పూర్తిస్థాయిలో లేకపోవడం, శ్మశానంలో ఉన్న చేతిపంపు మరమ్మతుకు గురికావడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు అంటున్నారు. వీధుల్లో చెత్తాచెదారం అంతా శ్మశానవాటిక చుట్టు పడవేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. అధికారులు స్పందించి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో చెత్తను తొలగించి దారిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

444 మద్యం బాటిళ్ల ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బొండపల్లి: మండల పరిధిలో ఇటీవల కాలంలో పలు ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను పోలీసులు ధ్వంసం చేశారు. గత ఆరు నెలల వ్యవధిలో నమోదైన 18 కేసుల్లో ఎక్సైజ్ అధికారులు 444 మద్యం బాటిళ్లను స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు.

రైల్వే గేట్ మూసివేత

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే గేట్‌ను శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం ఉదయం 5 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. మూడో లైన్ రైల్వే ట్రాక్ పనుల నేపథ్యంలో గేటును మూసి వేస్తున్నట్లు వెల్లడించారు. దీనిపై ఇప్పటికే తహసీల్దార్, స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. వాహన చోదకులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించాలని కోరారు.

వరి విత్తనాల కోసం ఆర్‌బీకేల్లో సంప్రదించండి

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 17 ఆర్బీకేల ద్వారా రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నామని ఏఓ అనురాధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే రైతుల అవసరాల మేరకు విత్తనాలు అందించామని, ఇంకా ఎవరికైనా విత్తనాలు కావాలంటే ఆర్‌బీకేల్లో సంప్రదించాలని సూచించారు. విత్తనాలు కావాల్సిన రైతులు వీఏఏలను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చినబంటుపల్లిలో పారిశుద్ధ్య పనులు



వీధికాలువలో పూడికలు తొలగిస్తున్న కార్మికుడు

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లిలో సర్పంచ్ కోట్ల అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎం.చక్రధరరావు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. పంచాయతీ పరిధిలోని చినబంటుపల్లి, సింగవరం, పతివాడపేట గ్రామాల్లోని వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించి ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. తాగునీటి బోర్లు, బావుల పరిసరాలను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

3న స్క్రాప్ వేలం

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద వచ్చే నెల 3న పాడైన బోర్లకు సంబంధించిన సామాగ్రి(తుక్కు ఇనుము)ని వేలం వేయనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంలో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టామని, పాడైన బోర్లకు సంబంధించిన విడిభాగాలను ప్రస్తుతం వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు టెండర్లు సమర్పించాలని సూచించారు. ఎక్కువ ప్రైస్ కోట్ చేసిన వారికి సామగ్రి అందజేయనున్నట్లు వెల్లడించారు.

రేడియేషన్‌తో పరేషాన్

- జనావాసాల మధ్య సెల్‌టవర్లు
- నిబంధనలకు పాతరేస్తున్న కార్పొరేట్ కంపెనీలు
- కొన్నింటికే అనుమతులు
- భారీగా వెలువడుతున్న రేడియేషన్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



నగరంలోని ఓ ఇంటిపై సెల్ టవర్

విజయనగరం: మారుతున్న కాలానుగుణంగా ప్రజలందరికీ సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. చిన్నారులను తప్పిస్తే ప్రతి ఒక్కరి చేతిలోనూ సెల్‌ఫోన దర్శనమిస్తోంది. అవసరాలకు ఫోన్ ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, దాని వల్ల కొన్ని ఇబ్బందికర పరిస్థితులు కూడా ఉన్నాయన్న విషయం గుర్తుంచుకోవాలి. ఇప్పటికే రసాయన ఎరువులతో పంటలు పండించడంతో ఆహారం విషతుల్యం అవుతున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ అందించే టవర్ల వల్ల విపరీతమైన రేడియేషన్‌తో ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. జనవాసాల మధ్య టవర్లు ఏర్పాటు చేయడం వల్ల వాటి నుంచి విడుదలయ్యే అధిక రేడియేషన్‌తో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

ప్రజల ఆరోగ్యంపై సెల్ టవర్ల నుంచి వెలువడుతున్న రేడియేషన్ తీవ్ర ప్రభావం చూపుతోంది. కొన్ని కార్పొరేట్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం ఏమైతే తమకేంటనే ధోరణి కొన్ని కార్పొరేట్ సంస్థల్లో కనిపిస్తోంది. రోజు రోజుకూ పెరిగిపోతున్న సెల్‌టవర్ల ఏర్పాటే ఇందుకు నిదర్శనం. తమ వ్యాపారం కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్న సంస్థలు నిబంధనలకు పాతరేస్తున్నాయి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న సెల్ కంపెనీల యాజమాన్యాలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ, గ్రామీణప్రాంత ప్రజలు కోరుతున్నారు. గతంలో రాజకీయ నేతల ఒత్తిడి, కార్పొరేట్ సంస్థల ప్రలోభాలకు అధికారులు తలొగ్గడంతో విచ్చలవిడిగా టవర్లు ఏర్పాటయ్యాయి. ఇది స్థానిక ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికి తోడు మానవ మనుగడకే అతి ప్రమాదకరమైన రేడియేషన్ పెద్ద ఎత్తున విడుదల అవుతుండడంతో గ్రామీణ ప్రాంతంలో పక్షిజాతులు సైతం అంతరించుకుపోతున్నాయి. వాతావరణంలో ఇంతటి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

రేడియేషన్ ముప్పు..

విజయనగరం జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా సెల్ టవర్లు దర్శనమిస్తున్నాయి. టవర్లు ఉన్న ప్రాంతంలో రేడియోధార్మిక ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా సెల్ టవర్లకు 100 మీటర్ల పరిధిలో ఉండే వారికి నిద్రాభంగం, ఊపిరి ఆడకపోవడం, డిప్రెషన్, తలనొప్పి, అలసట, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు ఏర్పడతాయని పలువురు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదం సంభవిస్తే..

సెల్ టవర్లను పాఠశాల భవనాలపై, నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. భూమి కంపించినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు అవి కూలితే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుంది. గ్రామాల్లో నివాస గృహాల మధ్య ఒకే టవర్‌పై వివిధ కంపెనీలకు చెందిన పరికరాలు అమర్చడంతో అక్కడ అధిక రేడియేషన్ వెలువడతోందని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యం దెబ్బతింటోంది..

పట్టణంలో ఇష్టానుసారంగా సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయడంతో ఆరోగ్యం దెబ్బతింటోంది. నిబంధనలకు విరుద్ధంగా టవర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఒక్కో ఇంటి డాబాపై ఒకే టవర్‌కు పలు కంపెనీలకు చెందిన పరికరాలు ఏర్పాటు చేయడంతో రేడియేషన్ అధిక మొత్తంలో విడుదలవుతోంది. అధికారులు స్పందించి జనావాసాల నడుమ ఉన్న టవర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– పి. శంకరరావు, విజయనగరం

ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరి..

గ్రామీణ ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ.. పట్టణాల్లో టౌన్ ప్లానింగ్ అధికారుల నివేదిక అనుగుణంగా అనుమతులు ఇస్తారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ 183) ప్రకారం అనుమతులు లేనిదే ఎక్కడబడితే అక్కడ సెల్‌టవర్ ఏర్పాటు చేయడానికి వీల్లేదు. జిల్లాలో చాలా టవర్లకు అనుమతులు లేవు. స్థానిక అధికారులు కంపెనీ ప్రతినిధులతో చేతులు కలిపి విచ్చలవిడిగా టవర్లు ఏర్పాటు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

- ఆర్డీఓ ఏవీ సూర్యకళ



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ సూర్యకళ

గంట్యాడ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఏవీ సూర్యకళ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కలుషిత నీటి వల్ల డయేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. మంచినీటి పథకాల ట్యాంకులు, పరిసరాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పూడికలు తొలగించాలని, దోమలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హోటళ్లు, డాబాల్లో వ్యర్థాలను బయట పారవేయకుండా సంబంధిత యజమానులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. అనంతరం పెదమజ్జిపాలెం గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, ఎంపీడీఓ భవాని, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్, పీఎంపాలెం, గంట్యాడ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ హేమలత, డాక్టర్ పల్లవి, డాక్టర్ వెంకటేష్, ఎంఈఓలు విజయకుమారి, వెంకటరావు, తదితరులు ఉన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: గ్రామాల్లోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు, వెల్ఫేర్ సహాయకులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా కలుషిత నీరు సరఫరా కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ కె.సుగుణాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సునీల్, బొండపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజ్‌గోపాల్, ఏఓ డి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులపై క్లీనింగ్ తేదీ తప్పనిసరి



పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రూపేష్, ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావు

లక్కవరపుకోట: రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు మళ్లీ ఎప్పుడు ట్యాంకు శుభ్రం చేస్తారో ఆ తేదీని దానిపై కచ్చితంగా రాయాలని ఎంపీడీఓ కె.రూపేష్ సూచించారు. మండలంలోని ఖాసాపేట గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, వాటర్ ట్యాంక్ శుభ్రత పనులను ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావుతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మురుగునీరు వీధుల్లో నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

- వ్యవసాయశాఖ ఏడీ ఎల్.విజయ



సోంపురం జంక్షన్‌లోని ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ ఎల్.విజయ, ఏఓ స్వాతికుమారి

లక్కవరపుకోట: ఖరీఫ్ వరి విత్తనాలను అధిక ధరలకు అమ్మినా, నాసిరకం విత్తనాలు అమ్మినా కఠిన చర్యలు తప్పవని కొత్తవలస సబ్‌డివిజన్ వ్యవసాయశాఖ ఏడీ ఎల్.విజయ హెచ్చరించారు. మండలంలోని సోంపురం జంక్షన్, ఎల్.కోట జంక్షన్‌లలో ఉన్న విత్తనాలు, ఎరువుల దుకాణాలను స్థానిక ఏఓ స్వాతికుమారితో కలిసి గురువారం తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న ఎరువులు, పురుగు మందుల స్టాక్ వివరాలు, వాటి తయారీ, ఎక్స్పైరీ తేదీల వివరాలు, వరి విత్తనాల బస్తా నికర బరువు, తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరి విత్తనాలు అధిక ధరలకు అమ్మినా, నాసిరకమైన విత్తనాలను విక్రయించినా దుకాణాలు సీజ్ చేయడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని యజమానులకు సూచించారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సహాయకుడు ప్రసాద్

కొత్తవలస: మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తవలస పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దోమల నివారణ, దోమల వల్ల వచ్చే వ్యాధులు, వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య సహాయకులు ప్రసాద్ విద్యార్థులకు వివరించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగునీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారుతాయి కాబట్టి ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వినియోగించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, ఆరోగ్య సిబ్బంది సూరిదేముడు, హేమలత, పైడితల్లిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'క్యాట్' శిక్షణకు 18 మంది విద్యార్థులు



శిక్షణ కోసం సీహెచ్‌సీలో చేరిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వినోద్‌బాబు

చీపురుపల్లి: క్లినికల్ అటాచ్‌మెంట్ ట్రైనింగ్(క్యాట్) శిక్షణకు స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు ఎంపికైన విద్యార్థులను గురువారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాయక్ సమక్షంలో పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు పూర్తి చేసిన 18 మంది విద్యార్థులను 'క్యాట్' శిక్షణకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వారంతా స్థానిక సీహెచ్‌సీలో 12 నెలల పాటు వృత్తిపరమైన శిక్షణ తీసుకోనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు వైద్య రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంఎల్‌టీ కోర్సు చదివిన విద్యార్థులు ఇదొక సువర్ణ అవకాశమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.గీతా ఇందిరాదేవి, కేవీ అరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రాజాం రోడ్డులో జి.అగ్రహారం వద్ద ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న గొయ్యి

చీపురుపల్లి: పట్టణంలోని మెయిన్ రోడ్ నుంచి రాజాం వెళ్లే ప్రధాన మార్గంలో జి.అగ్రహారం వద్ద రోడ్డు పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడింది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రోడ్డును ఆనుకుని గొయ్యి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం నుంచి రాజాం వెళ్లే రోడ్డులో పాత ఆర్‌టీబీ స్థానంలో రూ.12.99 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీని కోసం పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్ నుంచి జి.అగ్రహారం వరకు రాజాం రోడ్డులో పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో చీపురుపల్లి నుంచి రాజాం వైపు వెళ్లే ప్రధాన మార్గాన్ని ఆనుకుని జి.అగ్రహారం వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. అధికారులు దాన్ని పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కనీసం గొయ్యికి అడ్డంగా బారికేడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో ఇలా బారికేడ్లు లేకుండా ఉన్న గొయ్యితో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరి సాగుకు సన్నద్ధం...

- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- నారుమడుల తయారీలో బిజీగా రైతన్నలు
- నియోజకవర్గంలో సుమారు 26 వేల ఎకరాల్లో వరి సాగు



కుమిలి రైతుభరోసా కేంద్రంలో విత్తనాలు తీసుకుంటున్న రైతులు (ఫైల్)



చౌడువాడలో సిద్ధం చేసిన వరినారు మడులు

పూసపాటిరేగ : అన్నదాతలు వ్యవసాయ పనులలో బిజిబిజీగా ఉన్నారు. పది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు ప్రారంభించారు. వరి నారు వేయడానికి మడులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు తీసుకున్న రైతులు విత్తనశుద్ధి కూడా చేపట్టారు. తొలకరి వర్షాలు వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగపడ్డాయి. పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమైన నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలున్నాయి. ఆయా మండలాల్లో 25,600 ఎకరాలలో ఖరీఫ్‌లో వరిసాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. పూసపాటిరేగ మండలంలో 7200 ఎకరాల్లో, డెంకాడలో 6400, భోగాపురంలో 5300, నెల్లిమర్లలో 6700 ఎకరాలలో వరిసాగు చేపడుతున్నారు.

అందుబాటులో విత్తనాలు

వ్యవసాయాధికారులు ఆర్‌బీకేల ద్వారా ఇప్పటికే రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేశారు. వరిలో ఎంటీయూ 1224, బీపీటీ 5204, ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 7029, ఎంటీయూ 1061, బీపీటీ 3291, తదితర రకాల విత్తనాలను ఆర్‌బీకేలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉంటే గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతుభరోసా డబ్బులు అందాయని.. ప్రస్తుత కొత్త ప్రభుత్వ హయాంలో ఎటువంటి పెట్టుబడి సాయం అందలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి సాయం అందజేయాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇంకా పెట్టుబడి సాయం అందలేదు. దీంతో పెట్టుబడులకు ఇబ్బంది పడుతున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతుభరోసా పథకం కింద రూ.5,500, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకంలో భాగంగా రూ. రెండువేలు అందించాయి. ప్రభుత్వం స్పందించి రైతులకు ఆర్థిక సాయం అందించాలి.

– కె. వెంకటరావు, రైతు పూసపాటిరేగ.

నాణ్యమైన విద్యుత్ అందించండి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



సవరవిల్లిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

నెల్లిమర్ల: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యేక దృష్టి సారించి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. భోగాపురం మండలంలోని సవరవిల్లి సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన విద్యుత్ అందించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు ఎం. లక్ష్మణరావు, జి. సురేష్‌బాబు, కె. సత్య పరిపూర్ణకుమార్, మస్తాన్ వలీ, అప్పలనాయుడు, నాయకులు మట్టా అయ్యప్ప, పల్లంట్ల జగదీష్, పల్లా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం నిర్మాణాలపై దృష్టి సారించండి

- ఎస్ఎఫ్ఐ నాయకులు



కలక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో ఎటువంటి అనుమతుల్లేకుండా, నాసిరకంగా భవనాలు నిర్మిస్తున్న నారాయణ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేశ్ మాట్లాడుతూ... నేడు విద్య అనేది మార్కెట్‌లో ఒక వ్యాపార సరుకుగా మారిందన్నారు. నారాయణ స్కూల్ ప్రతినిధులు ప్రదీప్‌నగర్‌లో నిర్మిస్తున్న భవనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. అనంతరం డీఆర్ఓ అనితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రమేష్ , జిల్లా సహాయ కార్యదర్శి సమీర , జిల్లా కమిటీ సభ్యుడు వంశీ, నాయకులు శివ, గుణ, యర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.